క్లుప్తంగా

ఈ నెల 24 నుంచి జగనన్న సురక్ష

చాపాడు : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24 నుంచి గ్రామ సచివాలయాల్లో అన్ని రకాలైన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా మంజూరు చేయనున్నట్లు ఇన్‌చార్జీ ఎంపీడీఓ రాధాకృష్ణవేణి తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల, ఆదాయ, జనన, మరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్ నమోదు, కొత్త రేషన్ కార్డు నమోదు, మ్యుటేషన్, పేర్లు మార్పు, కౌలు గుర్తింపు కార్డుల పొందవచ్చన్నారు. నెల రోజుల పాటు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నేడు సిద్దారెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

చాపాడు : మండలంలోని సిద్దారెడ్డిపల్లె గ్రామంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రజల సమస్యలు, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుపై నేరుగా అడిగి తెలుసుకోనున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

విద్యాశాఖాధికారి- 2గా వంశీకృష్ణ

చాపాడు : మండల అదనపు విద్యాశాఖ అధికారిగా వి.వంశీకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న వంశీకృష్ణను మండల విద్యాశాఖాధికారి -2గా నియమితులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇదే క్రమంలో చియ్యపాడు హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న నరహరిశర్మ మైదుకూరు మండల అదనపు విద్యాశాఖాధికారిగా నియమితులయ్యారు.

మండలస్థాయి క్రీడా పోటీలు



క్రీడా పోటీలు నిర్వహిస్తున్న ఎంఈఓలు, పీఈటీలు

అట్లూరు : మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో మండలస్థాయి క్రీడా పోటీలు బుధవారం నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి విలియంరాజు తెలిపారు. మండల పరిధిలోని పలు పాఠశాలల నుంచి ఈ పోటీలలో విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను నియోజకవర్గ పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా నిర్వహించి అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఖాదర్‌వల్లి, కేజీబీవీ ఎస్‌ఓ ఫణిశ్రీ,, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-2 నియామకం

మైదుకూరు : మైదుకూరు మండలానికి మండల విద్యాశాఖాధికారి -2 నియమితులయ్యారు. చాపాడు మండలం చియ్యపాడు జెడ్పీ హైస్కూల్‌లో గణిత సహాయకుడిగా ఉన్న నరహరిశర్మ మైదుకూరు ఎంఈఓ-2గా బాధ్యతలు చేపట్టారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తామని, ఉపాధ్యాయులందరూ సహకరించాలని కోరారు.

క్విజ్ పోటీలో విద్యార్థుల ప్రతిభ

బద్వేలు అర్బన్ : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బద్వేలు, అట్లూరు మండలాల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ నెల 28న కడపలో జరిగే జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : వలంటీర్లు, గృహసారధులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారులు నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం సభాభవనంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రంగసముద్రం 2వ సచివాలయం వలంటీర్లు, బూత్ కన్వీనర్లు సమావేశంలో మాట్లాడారు. వలంటీర్ల విధివిధానాలు గురించి వివరించారు. సమావేశంలో సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, తహసీల్దారు గంగయ్యలు మాట్లాడారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రొద్దుటూరు : పశువైద్య కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు బుధవారం పట్టణంలోని పలు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, జిల్లా ఆస్పత్రిలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో, యోగకేంద్రాలలో ఘనంగా నిర్వహించారు. యోగ సాధన చేయడం ద్వారా కలిగే ఉపయోగాలను పలువురు యోగ గురువులు, ప్రముఖులు వివరించారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయుర్వేద వైద్యురాలు అపర్ణ మాట్లాడుతూ నిత్యం యోగ సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలను తొలగించవచ్చన్నారు. హోమియో వైద్యురాలు ఎస్.రాజేశ్వరి మాట్లాడారు. యోగ గురువు సునంద, కాంపౌండర్‌లు కపిల్, మహేశ్వరయ్య, ఎంఎన్‌ఓ రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక అగస్త్యేశ్వరాలయంలో యోగ కేంద్రాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 వరకు ఉచితంగా యోగ తరగతులు ఉంటాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లిఖార్జున, నాగేశ్వరి, భారతి, సావిత్రమ్మ, మహేశ్వరశర్మ, అర్చకులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

■ సరస్వతీ విద్యామందిరంలో నిర్వహించిన వేడుకలో సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, యోగ గురువు రమణ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులరెడ్డి, యోగసాధకులు పాల్గొన్నారు.

■ శ్రీ వాసవీ కన్యాకాపరమేశ్వరి ఉద్యానవనంలో నిర్వహించిన యోగ దినోత్సవ వేడుకలో అవోపా అధ్యక్షుడు పద్మనాభయ్య, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, సభ్యులు, ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు రవీంద్రబాబు పాల్గొన్నారు. యోగా గురువు మునిశేఖర్ యోగా ప్రాముఖ్యతను వివరించి యోగాసనాలు వేయించారు.

■ లింగారెడ్డి నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యోగ దినోత్సవంలో ప్రధానోపాధ్యాయురాలు షేక్ జవహర్ మునీర్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

■ స్థానిక గురురాఘవేంద్ర హైస్కూల్‌లో యోగా గురువు శ్రీహరి ఆధ్వర్యంలో యోగాపై శిక్షణా తరగతులు నిర్వహించారు. కరస్పాండెంట్ పెద్దరెడ్డెయ్య యోగా ప్రాముఖ్యతను, యోగా సాధన చేయడం ద్వారా కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. రాయలసీమ వ్యాయామ కళాశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్ విద్యార్థులు, అధ్యాపకులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో నిర్వహణాధికారి శంకర్‌రెడ్డి, మల్లేల లక్ష్మీకాంతమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ స్థానిక గౌతమి మహిళా ఇంజనీరింగ్ కాలేజిలో యోగా గురువు గురుదేవ్ రామిరెడ్డి హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పిరమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్ నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూషా, అకడమిక్ అడ్వైజర్ ఉమాకాంతం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పశువైద్య కళాశాలలో..

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో జాతీయ సేవా పథకం, ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు శ్రీరామ్ మనోహర్ యోగా ప్రయోజనలను పశువైద్య విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు పి.కళ్యాణి, ఎ.ప్రశాంత్ బాబు, సాయి దిలీప్ గుప్త పాల్గొన్నారు.

■ ప్రొద్దుటూరులోని ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, యోగా గురువు మునిశేఖర్‌రెడ్డి యోగా విశిష్టతను వివరించారు.

యోగా చేస్తూ ఆరోగ్యంగా జీవించండి

ప్రొద్దుటూరు క్రైం : నిత్యం యోగా చేస్తూ ఆరోగ్యంగా జీవించాలని జమ్మలమడుగు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని సోములవారిపల్లెలో ఉన్న రామాలయం వద్ద బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు హనీఫ్‌బాబా, శివప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, సీహెచ్‌ఓలు నరసింహ, గంగతులసి, ఆరోగ్య కార్యకర్తలు ఉమా గాయత్రి, అరుణ, దీప్తి, సుబ్బయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మైదుకూరు : ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే యోగా ఎంతో అవసరమని మైదుకూరులోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి టి.రవికుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌సీఎం పాఠశాలలో బుధవారం నిర్వహించారు. అనంతరం ఆయుర్వేద వైద్యాధికారి రవికుమార్ విద్యార్థులకు యోగా ఆవశ్యకతను తెలియజేసి, యోగాసనాలు వేయించారు. పాఠశాల హెచ్ఎం వివేకానందరెడ్డి, వైద్యశాల సిబ్బంది సుబ్బయ్య, యోగా శిక్షకులు శ్రీకాంత్, లావణ్య పాల్గొన్నారు.

ఆరోగ్యం మానసిక ఉల్లాసానికి యోగా

యోగా అనేది ఆరోగ్యాన్ని ఇవ్వడమే కాకుండా మానసిక ఉల్లాసం కలిగిస్తుందని మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు యోగా ఆవశ్యకతను వివరించారు.

ఐడీపీఎస్‌లో యోగా, సంగీత దినోత్సవం

చాపాడు : స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ యోగా, సంగీత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే శీర్షాసనం, బకాసనం, మలాసనం, వృక్షాసనం, సర్వాంగాసనం ఇంకా పలు రకాలైన ఆసనాలు వేయించారు. అనంతరం యోగా ఉపయోగాల, సంగీతం గొప్పతనం గురించి విద్యార్థులకు వక్తలు వివరించారు. కార్యక్రమంలో ఐడీపీఎస్ చైర్మన్ డా.వి.జయచంద్రారెడ్డి, డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.రవీంద్ర, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీబీఐటీలో..

స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో బుధవారం ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు యోగా గురువులు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యోగా జీవన విధానంలో భాగం కావాలి

బద్వేలు అర్బన్ : మానవుని జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలని, అప్పుడే మానవుడు ప్రశాంతంగా జీవనం సాగించగలడని రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావులు తెలిపారు. బుధవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించడంతో పాటు యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో యోగా గురూజీ అమరేంద్రనాథ్, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు అంకయ్య, ఉపాధ్యక్షులు శేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు. రోజూ యోగా చేయడం ద్వారా అసంక్రమణ వ్యాధులను దూరం చేయవచ్చని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 10 సచివాలయాల పరిధిలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వినీత్‌కుమార్ రాజు, డాక్టర్ ఉదయకిరణ్, సీహెచ్‌ఓలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగమణి, మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోపవరం : మండలంలోని అన్ని సచివాలయాల్లో సిబ్బంది, వలంటీర్లు, స్థానికులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ హసీనా, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ సరస్వతి, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన యోగాదినోత్సవ సభలో రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. జడ్పీటీసీ ముత్యాల ప్రసాదరావు, స్పెషలాఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షులు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, యువ నాయకులు గిరిప్రణీత్‌రెడ్డి యోగా విశిష్టతను గురించి తెలిపారు. డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సులోచన ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.



యోగాసనాలు వేస్తున్న ఆర్‌సీఎం విద్యార్థులు



ప్రొద్దుటూరు కల్చరల్ : ఆసనాలు వేస్తున్న డాక్టర్లు, వైద్యసిబ్బంది



యోగా గురించి వివరిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి రవికుమార్



బద్వేలులో యోగా చేస్తున్న విద్యార్థులు

క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు



క్విజ్ పోటీ విజేతలతో ఎంఈఓలు, ఉపాధ్యాయులు

మైదుకూరు : మైదుకూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయ ఆవరణలో బుధవారం హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఆరుగురు విజేతలు నిలిచారు. భారతీయ రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆర్థిక నిర్వహణపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో మైదుకూరు జెడ్పీ హైస్కూల్ (బాలురు) విద్యార్థులు రోహిత్ కుమార్, యాసిన్‌లు మొదటి బహుమతి గెలుచుకున్నారు. శెట్టివారిపల్లె హైస్కూల్ విద్యార్థులు అపర్ణ, ఉదయశ్రీ రెండో బహుమతిని, మైదుకూరు జెడ్పీ హైస్కూల్ (గరల్స్) విద్యార్థులు వెంకట శ్రావణిధనలక్ష్మి రాయల్, చంద్రలీల మూడో బహుమతిని అందుకున్నారు. మిగిలిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పద్మలత, ఎంఈఓ-2 బి.నరహరిశర్మ, యూనియన్ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వంశీధర్‌గౌడ్

బద్వేలు అర్బన్ : పెండింగ్ కేసులపై దృష్టి సారించి వీలైనంత త్వరగా కేసులను పరిష్కరించాలని మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో బద్వేలు అర్బన్, బద్వేలు రూరల్ సీఐలు, ఎస్ఐలతో పాటు సిబ్బంది, మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా వీలైనన్ని కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు, మహిళలకు అవగాహన కల్పించాలని కోరారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు దిశ యాప్‌పై అవగాహన కల్పించాలని కోరారు. అలాగే అసాంఘీక కార్యకలాపాలపై దృష్టి సారించి ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలని మహిళా సంరక్షణ కార్యదర్శులకు సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులపై నిఘా ఉంచాలని సూచించారు. సమావేశంలో అర్బన్, రూరల్ సీఐలు వెంకటేశ్వర్లు, హనుమంతనాయక్, ఎస్ఐ వెంకటరమణ, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈద్గాలో వసతులు కల్పించాలి



మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతి పత్రం ఇస్తున్న ముస్లిం మైనారిటీ కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు : బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈద్గా మైదానంలో వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డిలకు ముస్లిం మైనారిటీ కౌన్సిలర్లు, అంజుమన్ అహలె ఇస్లాం కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జిలు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో నమాజు సమయంలో సామియానా, మంచినీరు, కూలర్లు వంటి వసతులు కల్పించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లి వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఖలీల్, వై.మహ్మద్ గౌస్, వార్డు ఇన్‌చార్జిలు వడ్ల దాదాపీర్, హిదాయత్, నూరి, అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ ప్రెసిడెంట్ బొల్లవరం బాషా, జాయింట్ సెక్రటరీ బాబా తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాల కోసం ఎంపికలు



స్టాండింగ్ బోర్డు జంప్ చేస్తున్న విద్యార్థి

మైదుకూరు : కడపలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి బుధవారం మైదుకూరులో ఎంపిక పోటీలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో 3, 4 తరగతుల విద్యార్థులకు ఫ్లయింగ్ స్టార్ట్, రన్నింగ్, స్టాండింగ్ బోర్డు జంప్ వంటి పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలని ఎంఈఓ పద్మలత తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 నరహరిశర్మ, మండలంలోని పలువురు పీఈటీలు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య పారిశుధ్య సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన బైక్‌పై మున్సిపాలిటీలో ప్రతి వార్డు సచివాలయాన్ని సందర్శించి శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. డోర్ టు డోర్ కసువు సేకరిస్తున్నారా లేదా అని, కసువు పాయింట్లు, మురికి కాలువలను శుభ్రం చేస్తున్నారా లేదా అని కమిషనర్ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. శ్రీనివాసనగర్‌కు సంబంధించిన కౌన్సిలర్లు సత్యం, జిలాన్ బాషాలతో కమిషనర్ మాట్లాడి వార్డుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనులు మెరుగు పరిచి పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు చర్య లు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు.

23న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రొద్దుటూరు : విద్యుత్ చార్జీల పెంపుపై పెన్నా నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఈనెల 23న ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య తెలిపారు. బుధవారం ఆయన సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచుతున్నాయన్నారు. వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు, స్లాబ్ సిస్టం పేరుతో వ్యాపార, వాణిజ్య వర్గాల వారిని దోపిడీ చేస్తున్న పాలకుల తీరును నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాన్ని వామపక్షాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కూడిన అఖిలపక్షం నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, సమితి సభ్యులు వై.హరి పాల్గొన్నారు.

పనుల్లో అవినీతి లేకుండా చూడాలి

పోరుమామిళ్ల : ఉపాధి పనుల్లో అవకతవకలు లేకుండా ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా అందరూ పనిచేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంటు, టెక్నికల్ అసిస్టెంట్లుతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అనంతరం రంగసముద్రం -1 సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని స్త్రీశక్తి భవనంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశంలో అధికారులు, అన్ని వార్డుల కౌన్సిలర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ

దువ్వూరు : మండల పరిధిలోని గొల్లపల్లె గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో చదువుతున్న 30 మంది విద్యార్థులకు అమ్మా సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, అట్టలు అందించారు. ఈ సందర్భంగా అమ్మా సేవా సమితి అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ తమ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విద్యార్థులకు విద్యాసామగ్రిని అందిస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయుడు ఎలికే సుభాని, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈగా షర్మిళరాణి



ఏఈ కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏడీఈ రవి

బద్వేలు అర్బన్ : ఏపీఎస్‌పీడీసీఎల్ బద్వేలు పట్టణ ఏఈగా కె.మేరీషర్మిళరాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడప సీఈ కార్యాలయంలో జూనియర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న ఈమె ఇటీవల జరిగిన బదిలీల్లో డిప్యుటేషన్‌పై బద్వేలు ఏఈగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను ఏడీఈ రవిచంద్రశేఖర్, ఏఈలు చిన్నయ్య, విజయకుమార్‌లు సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్ పరమైన సమస్యలు పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని తెలిపారు.

జగనన్న సురక్షపై ఇంటింటి సర్వే



గోపవరంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

గోపవరం : జూలై 1వ తేదీ నుండి ప్రారంభించే జగనన్న సురక్ష కార్యక్రమంపై ముందుగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారదులు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాల కోసం అవసరమయ్యే 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా లబ్ధిదారులకు చేరవేరనున్నారు. ఈ మేరకు ఇంటింటికి వెళ్ళి వారికి అవసరమైన సర్టిఫికెట్లను గుర్తించి వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జూలై 1 నుండి నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారుల నుండి గుర్తించి సర్టిఫికెట్లను తయారు చేసి లబ్ధిదారులకు అందించనున్నారు. ఈ కార్యక్రమం మండల వ్యాప్తంగా బుధవారం ప్రారంభించారు. ఎప్పటికప్పుడు మండల ప్రత్యేకాధికారి నాగరాజ, ఎంపీడీఓ రామకృష్ణ సమీక్షిస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీకి సంబంధించి ఈకేవైసీ గురువారం సాయంత్రం లోపు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికి 47 శాతం నమోదైందని, నేటి లోపు వంద శాతం పూర్తి చేయాలన్నారు. రైతులు పశు బీమా నమోదు చేయించుకోవాలన్నారు.

ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట



విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

చాపాడు : దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో స్పెషలాఫీసర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం జగనన్న ఆణిముత్యాలు, విద్యా కానుక కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం వైఎస్ జగన్ వేలాది కోట్లను ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చి మంచి స్థానంలో స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు రవిశంకర్, వంశీకృష్ణ, కస్తూర్బా పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చాపాడు : మండలంలోని ఉపాధ్యాయుల సర్వీసుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్‌సుందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల విద్యాశాఖాదికారి రవిశంకర్‌తో పాటు నూతనంగా నియమితులైన అదనపు మండల విద్యాశాఖాధికారి వంశీకృష్ణను బుధవారం ఏపీటీఎఫ్ నాయకులు కలసి డైరీ అందజేశారు. ఏపీటీఎఫ్ నాయకులైన ఆయా గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక లేపాక్షి డిగ్రీ కాలేజి తృతీయ సంవత్సరం బీఎస్సీ చదువుతున్న 17మంది విద్యార్థులు విప్రోలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి తెలిపారు. లక్ష్మీప్రియ, నాగసాయి శరణ్య, ధరణి ప్రియ, వైష్ణవి, వేదవతి, అజయ్, సాయిసుదర్శన్, శశికుమార్ రెడ్డి, ఉమా గాయత్రి, సమీర, విజయలక్ష్మి, మాధురి, విజయ్, హర్షవర్ధన్‌రెడ్డి, గిరిధర్, పుల్లయ్య, షబ్బీర్ హుసేన్ ఎంపికయ్యారన్నారు. వీరికి వార్షిక వేతనం రూ.7.20 లక్షలు ఉంటుందని, బిట్స్‌పిలానిలో ఎంటెక్ చేసే అవకాశాన్ని విప్రో కంపెనీ కల్పించనున్నట్లు వివరించారు. వీరిని ప్రిన్సిపాల్‌తోపాటు కరస్పాండెంట్ రాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.